క్లుప్తంగా

సైన్స్ సబ్జెక్టులపై అవగాహన



నాగాయలంక: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ లో ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు ర్యాంక్ ఎడ్జ్(హైదరాబాద్) డైరెక్టర్ ఏఎస్ఎస్ శంకరరావు శనివారం కెమిస్ట్రీ, సైన్స్ సబ్జక్టులలో మెలకువలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఇంటర్ ఇతరత్రా పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయి అధిక మార్కులు పొందే విధంగా అవసరమైన సులభ పద్ధతులను వివరించి, అవసరమైన మెటీరియల్‌ను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు అలపర్తి సత్యనారాయణ, పద్యాల రఘురామయ్య, మాగంటి శ్రీనావాసరావు, రిటైర్డ్ హెచ్ఎం.పద్యాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు సబ్జెక్ట్‌లలో మెలకువలు నేర్పిన శంకరావును ఈ సందర్భంగా పాఠశాల తరఫున అభినందించారు.

సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలి



కృత్తివెన్ను: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని, ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని యూటీఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరాంజనేయులు, వీరాస్వామి, ఆదినారాయణ, ఏడుకొండలు, పురుషోత్తం, నాగరాజు, రామకృష్ణ, జ్యోతి, వరలక్ష్మి తదితరులు ఉన్నారు. .

కలెక్టర్‌ను కలిసిన మాల కార్పొరేషన్ చైర్మన్



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్ డీకే బాలాజీని రాష్ట్ర మాల సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయ్‌కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో విజయ్‌కుమార్ కలెక్టర్ డీకే బాలాజీకి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉపాధి అవకాశాల కోసం ఇచ్చే రుణాల వివరాలు, వాటి అంశాలను ఇరువురు కొద్దిసేపు చర్చించుకున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం సందర్శన

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని రాష్ట్ర మాల సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ శనివారం సందర్శించారు. సిబ్బందితో సమావేశమై కార్పొరేషన్ ద్వారా చేపడుతున్న పథకాలు ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకాలకు సంబంధించిన వసూళ్లు ఎస్సీ కార్పొరేషన్‌కు ఉన్న వాణిజ్య సముదాయిలు, భూమి కొనుగోలు పథకం తదితర అంశాలపై సిబ్బందితో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వెంట డైరెక్టర్ ఆంజనేయులు, ఎస్సీ కార్పొరేషన్ ఈవో సెల్వీ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ సంఘాల నాయకుల సత్కారం

చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్‌ను శనివారం ఎస్సీ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కర్రా సునీల్‌కుమార్, సంఘ నాయకులు మత్తె నాగరాజు, వంపుగడవల చౌదరి, బొమ్మిడి విజయ్‌రవీంద్ర తదితరులు పాల్గొని ఆయనను సన్మానించారు

23 మందికి సీఎంఆర్ఎఫ్ సాయం

అవనిగడ్డ: స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 23 మంది లబ్ధిదారులకు రూ.21,90,737 సహాయం చెక్కులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికి 627 మంది పేదలకు రూ.4,89,34,363 ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించినట్లు వివరించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గోశాలకు మందుల పంపిణీ

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలోని గోశాలలో ఉన్న గోవులను పశువైద్యాధికారులు శనివారం పరిశీలించారు. గోవుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా నులిపురుగుల నివారణ మందులను మండల పశువైద్యాధికారి డాక్టర్ నంద కిషోర్ ఆలయ సిబ్బందికి అందజేశారు.

ప్రభుత్వ కార్యాలయాలు.. పాములకు ఆవాసాలు!



ఉపాధి హామీ కార్యాలయం వెనుక చెత్తాచెదారం



ఇండోర్ స్టేడియం ముందు ఉన్న మురుగుదొడ్ల ఎదుట పెరిగిన పిచ్చి మొక్కలు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని అధికారులు ఊదరగొడుతుంటారు. ఇళ్ల ఆవరణలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు, విషసర్పాలు దరిచేరవంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తుంటారు. కానీ అధికారుల మాటలకు, ఆచరణకు పొంతన ఉండకపోవటం విశేషం. కోడూరు మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలన్నీ అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. చెట్లు దట్టంగా పెరిగి పాములకు ఆవాసాలుగా మారాయి. సిబ్బంది నిత్యం భయపడిపోతున్నారు. పిచ్చిచెట్లు దట్టంగా పెరిగినా అధికారులు తమ సమస్య కాదన్నట్టు వ్యవహరించటంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– కోడూరు



తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో అల్లుకున్న పిచ్చిమొక్కలు



వ్యవసాయ శాఖ కార్యాలయం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్లకంప



కోడూరు-1 సచివాలయం, రైతు సేవా కేంద్రాల వెనుక పరిస్థితి ఇదీ..



ఎమ్మార్పీ కార్యాలయం ఆవరణ ఇలా..

ఘనంగా సాంస్కృతిక సమ్మేళనం

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు సాంస్కృతిక సమ్మేళనం (కల్చరల్ మీట్) నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు నృత్య ప్రదర్శనలు, అమ్మవారి దశావతారాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్ కే.కిషోర్ కల్చరల్ కార్యక్రమ ఉద్దేశాన్ని విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలి



మచిలీపట్నంటౌన్: ఆత్మ గౌరవం, సమానత్వం సాధనకు కులవివక్ష నిర్మూలన కోసం సమరశీల ఉద్యమాలకు కేవీపీఎస్ కార్యకర్తలు సిద్ధం కావాలని జిల్లా అధ్యక్షుడు బుర్రె రాజు పిలుపునిచ్చారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం 28వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక రాజుపేటలో ఆ సంఘ మండల కార్యదర్శి పేటేటి రాజు కేవీపీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఆత్మగౌరవం, సమానత్వం దళితుల సామాజిక వివక్షత నుంచి కాపాడుకునేందుకు కేవీపీఎస్ ఏర్పడిందన్నారు. మండల కార్యదర్శి పేటేటి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు మిరియాల ఆనంద్ బెనర్జీ, నాయకులు వసంతరావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు కొడాలి శర్మ, సీఐటీయూ జిల్లా నాయకులు బూర సుబ్రహ్మణ్యం, టీ చంద్ర పాల్ తదితరులు పాల్గొన్నారు.

'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ప్రారంభం

అవనిగడ్డ: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గంలో ఈ పథకం ద్వారా 1302 మందికి రూ.1,95,35,000 లబ్ధి చేకూరిందని చెప్పారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, ఎంపీపీ తుంగల సుమతి, రవాణ శాఖ అధికారి లోకనాథ ప్రసాద్, తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీఓ మరియాదేవి, సుధాప్రవీణ్, స్వర్ణభారతి, వెంగళరావు, ఆనందరకుమారి, సీఐ యువకుమార్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, దొప్పలపూడి గంగాభవాని, దిడ్ల జానకి రాంబాబు, డొక్కు నాగేశ్వరరావు, పూడిపాముల కృష్ణకుమారి, పలువురు ప్రజాప్రతినిధులు నాయకులు, ఆటోయూనియన్ల నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



అవనిగడ్డలో ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

1,375 మంది ఆటో డ్రైవర్లకు..

పెడన: పెడన నియోజకవర్గ పరిధిలో 1,375 మంది ఆటో డ్రైవర్లకు సేవా పథకంలో భాగంగా మంజూరైన నిధులను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శనివారం అందజేశారు. పెడన ఏఎంసీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 1375 మంది ఆటో కార్మికులకు రూ. 2,06,25,000 సొమ్ములు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు మాట్లాడుతూ బీమా ప్రీమియంలు, పెనాల్టీలు అధికంగా ఉన్నాయని, వాటిని తగ్గించి ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. జెడ్పీటీసీ అర్జా నగేష్‌బాబు, ఎంపీడీఓ అరుణకుమారి, మున్సిపల్ మేనేజరు రాజా, పెడన నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థినుల విజ్ఞాన ప్రదర్శనలు

ఘంటసాల: ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో గుంటూరు లాం సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థినులు తమ గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన వివిధ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సామాజిక విజ్ఞాన కళాశాల ప్రతినిధి డాక్టర్ చైతన్య కుమారి మాట్లాడుతూ గృహవిజ్ఞాన శాస్త్రంలో నైపుణ్యతను మరింతగా పెంచుకోవాలని విద్యార్థినులకు సూచించారు. కేవికే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ 23 మంది విద్యార్థినులు ఘంటసాల, ఘంటసాలపాలెం, కొడాలి, పురిటిగడ్డ గ్రామాల్లో మూడు నెలలు పర్యటించి అక్కడి పరిస్థితులపై అవగాహన పెంచుకుంటూ శిక్షణ పొందారన్నారు. కొడాలి సర్పంచ్ చలపాటి రాణి, సామాజిక విజ్ఞాన అధ్యాపకులు నిర్మల, అపర్ణ, కేవికే శాస్త్రవేత్తలు కృష్ణవేణి, రేవతి, వెంకటలక్ష్మి, నవీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, సిబ్బంది, రైతులు, గ్రామీణ మహిళలు, యువత, విద్యార్థినులు పాల్గొన్నారు.

కృష్ణమ్మ ఒడిలో దుర్గమ్మ విగ్రహాల నిమజ్జనం



నాగాయలంకలో కనకదుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు



నాగేశ్వరరావుపేటలో నిమజ్జనానికి బయలు దేరిన కనకదుర్గమ్మ



కృత్తివెన్నులో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న చిన్నారులు

నాగాయలంక: స్థానిక పార్వతీ సమేత శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో 33వ వార్షిక శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం అమ్మవారి వసంతోత్సవం, నిమజ్జనం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. మండల ఆర్యవైశ్య సంఘం, స్థానిక వాసవీ సేవాదళ్ నేతృత్వంలో తొలుత శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఉత్సవ విగ్రహానికి అర్చకుడు కొల్లిపర సుబ్బారావు ఆధ్వర్యంలో సంప్రదాయక వసంతోత్సవ పూజ తాడికొండ సత్యనారాయణ- జయలక్ష్మి దంపతులచే జరిపారు. ఉత్సవ విగ్రహానికి ఊరేగింపు జరిపారు. అనంతరం ఫెర్రీ రోడ్డులో విగ్రహాన్ని శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్ వద్ద పడవపై ఉంచి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఆర్యవైశ్య సంఘాల నేతలు చిట్టా సాంబశివరావు, చిట్టా శివనాగేశ్వరరావు, చిట్టా వీర అన్నపూర్ణయ్య, వాసవీ సేవాదళ్ ప్రతినిధులు వంకాయల ఆదిరాజేష్, వి.హరీష్ కుమార్, చిట్టా శేఖర్, ఇతర కార్యకర్తలు గ్రామస్తులు, పాల్గొన్నారు.

కోడూరు: మండల గ్రామాల్లో దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహాలను కోడూరు పురవీధుల వెంట ఊరేగించి, నిమజ్జనోత్సవాలను కనులపండువగా జరిపారు. మండలంలోని నరసింహపురం, పోటుమీద గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల వద్ద నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. డప్పువాయిద్యాలు, మేళతాళాలు, బాణాసంచా వెలుగుల నడుమ శనివారం అమ్మవార్లకు ప్రత్యేక వాహనాలపై గ్రామోత్సవం జరిపారు. ప్రతి ఇంటి వద్ద మహిళలు అమ్మవారికి నీటిని వారబోసి భక్తిభావం చాటుకున్నారు. దుర్గమ్మ విగ్రహాలను ఉల్లిపాలెం సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.



గూడూరులో నిమజ్జనానికి తరలివెళ్తున్న అమ్మవారు

బంటుమిల్లి: మండల పరిధిలో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి విగ్రహాలకు శనివారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవీ నవరాత్రులు ముగియడంతో నాగేశ్వరరావుపేట, జానకీరామపురం, లక్ష్మీనారాయణపురం, ముంజులూరు తదితర గ్రామాల్లో అమ్మవారి ప్రతిమలను ట్రాక్టర్లపై ఉంచి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారి విగ్రహాలకు నీళ్లను బిందెలతో వారపోసి హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో దేవీ నవరాత్రుల్లో భాగంగా అమ్మవారిని శ్రీ శాంతాదేవీగా అలంకరించి పూజలు చేశారు. రాత్రికి సీతారాముల ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి 12 రకాల కళలతో రామాలయం చుట్టూ ద్వాదశ (12) ప్రదక్షిణాలు పండితుల ముక్తేవి సత్యన్నారాయణచార్యులు శిష్య బృందం వేద మంత్రాల మధ్య నిర్వహించారు. అనంతరం విగ్రహాలకు పల్లకి సేవలో భాగంగా పవళింపు సేవ చేసి భక్తులు రకాల పాటలతో ఆకట్టుకున్నారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: మండల పరిధిలోని పలు గ్రామాలలో అమ్మవారి ఊరేగింపులు శనివారం ఎంతో వైభవంగా జరిగాయి. కృత్తివెన్ను శివాలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారిని మేళతాళాల నడుమ ఎంతో ఘనంగా ఊరేగించారు. చిన్నారుల ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు ఆకట్టుకుంది.

గూడూరు: మండల పరిధిలో పలు ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి ప్రతిమల నిమజ్జనాలు శనివారం కోలాహలంగా సాగాయి. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై మేళతాళాలు, డీజే వాయిద్యాలతో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రామరాజుపాలెం కాల్వలో అమ్మవారి నిమజ్జనం చేశారు. రామరాజుపాలెం కాల్వ దగ్గర పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం ఒక్క రోజే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 13 ప్రతిమలు నిమజ్జనం చేశారు. ఆదివారం కూడా నిమజ్జనాలు కొనసాగనున్నాయి.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

చల్లపల్లి: కృష్ణానదికి వచ్చిన వరదల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఘంటసాల, చల్లపల్లి ప్రాంతాల్లోని కృష్ణానది కరకట్ట దిగువున ముంపునకు గురైన పంట పొలాలను ఆయన రైతు సంఘం నాయకుల బృందంతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కృష్ణానదిలోకి ప్రకాశం బ్యారేజీ వద్ద పెద్దమొత్తంలో వరద నీరు వదలటంతో పలు రకాల పంటలు ముంపుకు గురయ్యాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పసుపు, కంద రైతులు ఎకరాకు రూ.2 లక్షల వరకు నష్టపోయారని అన్నారు. నష్టపరిహారాన్ని పెంచటంతోపాటు ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు అవసరమైన రుణాలు, 100 శాతం సబ్సిడీతో విత్తనాలు, పురుగు మందులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. బృందంలో రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమానుల సురేంద్రనాద్ బెనర్జీ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వేమూరి రత్నగిరిరావు, ఇతర సభ్యులు ఉన్నారు.



వరద ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

శ్రీకాకుళంలో ఏపీ రైతు సంఘం పర్యటన

ఘంటసాల: మండలంలోని శ్రీకాకుళం గ్రామ పరిధిలోని కృష్ణానది పరీవాహక ప్రాంతంలో వరదలకు దెబ్బతిన్న వివిధ పంటలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, నాయకులు, రైతులతో కలసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ శ్రీకాకుళం గ్రామంలోని నదీ పరీవాహక ప్రాంతంలో 146 ఎకరాలలో కంద, పసుపు, అరటి, మినుము, తదితర పంటలు వరద తాకిడికి దెబ్బతిందన్నారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, హనుమానుల సురేంద్ర నాథ్ బెనర్జీ, వేమూరి రత్నగిరిరావు, కుంపటి వెంకటేశ్వరరావు, కోడి రాధాకృష్ణ, రాజరత్నం, భీక్షం రాజు, వెంకటేశ్వరరావు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలు అమలు చేయాలి

పెడన: కేంద్ర ప్రభుత్వం కల్పించిన జీఎస్టీ రాయితీలను వ్యాపారులు వినియోగదారులకు అందే విధంగా కృషి చేయాలని జీఎస్టీ డెప్యూటీ అసిస్టెంటు కమిషనర్ రాగమణి అన్నారు. శనివారం పట్టణ పరిధిలో జీఎస్టీ రాయితీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యాపారస్తులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె జీఎస్టీ రాయితీలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజరు ఎం.రాజ, కార్యాలయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చల్లపల్లి సీహెచ్‌సీకి జిల్లా స్థాయి అవార్డు



చల్లపల్లి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)కి ఉత్తమ స్వచ్ఛ ఆసుపత్రిగా స్వచ్ఛాంధ్ర-2025 జిల్లా స్థాయి అవార్డు లభించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాస్ శనివారం తెలిపారు. స్వచ్ఛ హాస్పిటల్స్ విభాగంలో ఈ అవార్డుకు ఎంపికైనట్లు చెప్పారు. ఆసుపత్రిలో చేతులు వాష్ చేసుకునేందుకు మౌలిక సదుపాయాలు, నిబంధనలకు అనుగుణంగా టాయిలెట్ల నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ, నియంత్రణ, తనిఖీలు, పరిశుభ్రతపై ఆసుపత్రి ఆవరణలో ప్రచురించబడిన స్పష్టమైన సూచనలు, సందేశాలతో కూడిన బోర్డుల ఏర్పాటు వంటి అంశాల్లో మొదటి స్థానంలో నిలిచినట్లు వివరించారు. జిల్లాలో ఐదు సీహెచ్‌సీలు ఉండగా ఉత్తమ సీహెచ్‌గా అవార్డుకు ఎంపికైనట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మోపిదేవి: మోపిదేవి శివారు గంజివానిపాలెం దళితవాడలో ఇటీవల బూసి దిలీప్ అనారోగ్యంతో మృతిచెందారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న తెలుగువన్ ఫౌండేషన్ అధినేత కంఠంనేని రవిశంకర్ బాధిత కుటుంబానికి రూ.15 వేలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు రవిశంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడికి సత్కారం




బంటుమిల్లి: బంటుమిల్లి తాలూక విశ్రాంత ఉద్యోగుల సంఘం, వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, సంక్షేమ సంఘం జిల్లా సభ్యుడు చండిక గంగాజలరావును గుంటూరు జిల్లా అధికారులు సత్కరించి అభినందించారు. శనివారం గుంటూరు జిల్లా కలెక్టరు కార్యాలయంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం గంగాజలరావు చేస్తున్న కృషికి అభినందించిన ప్రభుత్వ వయోవృద్ధుల సమక్షేమ శాఖ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సూర్యకుమారి, జిల్లా కలెక్టర్ తమిన్‌అన్సారియా, డైరెక్టరు రవిప్రకాష్‌రెడ్డిలు జ్ఞాపిక, అభినందన పత్రం అందజేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ

అవనిగడ్డ: ఇటీవల నల్గొండ జిల్లా, దేవరచర్ల గ్రామంలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన ముగ్గురిలో అవనిగడ్డకు చెదిన సాయికాంత్ (10) కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శనివారం పరామర్శించారు. స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలోని 2వ వార్డునందు మృతుని తండ్రి జాగ్రోతు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ఘటనా వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అవనిగడ్డ జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ (లచ్చి), వైఎస్సార్ సీపీ కృష్ణాజిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బండ్రెడ్డి వేణు, బాణావత్తు బాల, ధరావత్తు వసంత్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ కృష్ణాజిల్లా చైర్మన్‌గా డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్



డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్



లీలాబ్రహ్మేంద్ర

చల్లపల్లి: స్వచ్ఛ సుందర చల్లపల్లి రథసారథి, ప్రముఖ వైద్యులు దాసరి రామకృష్ణ ప్రసాద్ (డీఆర్‌కే ప్రసాద్) ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కృష్ణా జిల్లా శాఖ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ శనివారం మచిలీపట్నంలో నిర్వహించిన రెడ్‌క్రాస్ జిల్లా సమావేశంలో డీఆర్‌కే ప్రసాద్‌ను చైర్మన్‌గా నియమించారు. జిల్లాకు 11 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులలో రెడ్‌క్రాస్ చల్లపల్లి శాఖ చైర్మన్ నడకుదురు లీలాబ్రహ్మేంద్ర ఒక ఈసీగా నియమితులయ్యారు. వీరి నియామకంపై ఈప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.